క్లుప్తంగా

ఫ్రెషర్స్ డే హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వక్తలు కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు ప్రభాకర్, ధర్మపురి, బిక్షమయ్య, శ్రావణ్, మనోహర్, శ్రీనివాస్, వాణి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే పనులు పూర్తిచేస్తాం

సాక్షి స్పందన

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో నిర్మించిన అర్బన్ పార్క్‌లో సరైన సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్న దానిపై ‘ఆహ్లాదం సరే.. సౌకర్యాలేవి?’ అనే శీర్షికన ఈనెల 22న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మున్సిపల్ అధికారులకు దీనిపై నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీచేశారు. 20 రోజుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలతో పాటు క్యాంటీన్ కూడా పూర్తిచేస్తామని కలెక్టర్‌కు మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి వివరణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరా బేగం బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండోల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు లారీలను కేటాయించాలని కోరారు. త్వరలోనే అన్ని అలాట్ చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు సాబేరా బేగం తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగంను కలిశారు. వ్యవసాయ శాఖ పరంగా ఏఎంసీకి సహకరించాలన్నారు. ఆమె వెంట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ ఉన్నారు.

బోయినపల్లి తహసీల్దార్‌గా నారాయణరెడ్డి



బోయినపల్లి: మండల తహసీల్దార్‌గా కాలె నారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పుష్పలత బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ నారాయణరెడ్డికి కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

నియామకం

కోనరావుపేట: జాతీయ బీసీ యువజన సంఘం మండలశాఖ అధ్యక్షుడిగా మల్కపేటకు చెందిన ఎక్కల్‌దేవి జలేందర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అబ్బసాని సందీప్, ప్రధాన కార్యదర్శిగా నాగండ్ల మధు, కార్యదర్శిగా వడ్డేపల్లి మధు, సంయుక్త కార్యదర్శిగా మానుక సంజీవ్, కోశాధికారిగా అన్నబోయిన అభిషేక్‌ను నియమించారు.

ఆర్థికసాయం అందజేత



ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు గతనెల 8న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాచర్ల గొల్లపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007– 2008లో చదివిన పదో తరగతి విద్యార్థులు రూ.62వేలు, 2009–2010 సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.20వేల చొప్పున మృతుడి కుమారుడి పేరుపై రూ. 82వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. పూర్వ విద్యార్థులు దేవరాజు, సాయికృష్ణ, మధు, శివ, శ్రీకాంత్, ప్రదీప్, ఉస్మాన్, శ్రీకాంత్, వినయ్, ప్రతిభ, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

వేములవాడఅర్బన్: పట్టణంలోని బచ్‌పన్ హైస్కూల్‌ను వేములవాడ మండల విద్యాధికారి బన్నాజీ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. సీఆర్పీలు అకుల శ్రీనివాస్, సంతోషి తదితరులున్నారు.

అసంపూర్తిగా వంతెన పనులు

- తొమ్మిదేళ్లుగా సాగు..తున్న ఇల్లంతకుంట – అనంతారం బ్రిడ్జి నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి



ఇల్లంతకుంట - అనంతారం మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం

ఇల్లంతకుంట: రూ. కోట్లాది రూపాయలతో అనంతారం బిక్కవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు అసంపూర్తిగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2015లో వంతెన నిర్మాణానికి దాదాపు రూ.3కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ వాల్, సోలింగ్ పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడుతున్నారు. బ్రిడ్జి నుంచి రెండువైపులా దాదాపు 200 మీటర్ల వరకు అప్రోచ్ రోడ్డు కూడా వేయకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం బ్రిడ్జికి అటు ఇటు మట్టిపోయించి రోలింగ్ చేసి వాహనాలు వెళ్లేలా వేరే కాంట్రాక్టర్‌తో తాత్కాలిక పనులు చేయించారు. కాగా వర్షాలకు మట్టి కొట్టుకుపోయి కయ్యలుగా మారింది. అప్రోచ్‌వాల్, సోలింగ్ పనులు చేయకపోవడంతో మట్టి కిందకు జారుతోంది. ఏమాత్రం ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఇల్లంతకుంట– అనంతారం గ్రామాల మధ్య ఉన్న బిక్కవాగు దాటుతూ ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి



బ్రిడ్జిపై ఇనుప చువ్వలు తేలుతున్నాయి. కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకుండానే వదిలిపెట్టాడు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. మిగతా పనులు పూర్తిచేయాలి.

– చల్ల నారాయణ, అనంతారం మాజీసర్పంచ్

మట్టిరోడ్డు కొట్టుకుపోయింది



వంతెన నుంచి పోసిన మట్టిరోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

– వొల్లాల వెంకటేశం, వాహనదారుడు

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



ఇల్లంతకుంట: అనంతారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



వేములవాడ రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏనుగు తిరుపతిరెడ్డి



గంభీరావుపేట: ముస్తఫానగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ

ఇల్లంతకుంట: రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని అనంతారం, పెద్ద లింగాపూర్, చిక్కుడువాని పల్లె, వల్లంపట్ల, కందికట్కూర్, పొత్తూరు, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ప్యాక్స్ చైర్మన్ రొడ్ల తిరుపతిరెడ్డి, కార్యదర్శి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, మచ్చ రాజేశం, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి ,అంతగిరి వినయ్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: రైతులకు సహకార సంఘాలు అండగా ఉంటాయని వేములవాడ ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని ఫాజుల్‌నగర్, నూకలమర్రి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా సొసైటీ సంఘాలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. ప్యాక్స్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వైస్ చైర్మన్ లక్ష్మీ కాంతారావు, డైరెక్టర్లు కొండ శేఖర్, దొబ్బల మల్లేశం, దొంతరవేని రాజయ్య, సంజీవ రెడ్డి, చిందం తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట సింగిల్‌విండో ఆధ్వర్యంలో ముస్తఫానగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో రాజిరెడ్డి, నాయకులు బండ రమేశ్, రాజం, ప్రసాద్ రావు, కృష్ణకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని 10, 22 వార్డులలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ కల్లూరి లత మధు, బొలగం నాగరాజు, బుర్ర లక్ష్మి, ఏఎంసి చైర్మన్ వేముల స్వరూప తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని భూక్యతండా, ఎర్రగడ్డ తండా, గర్జనపల్లి, శాంతినగర్, మద్దిమల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మారుతి రెడ్డి, ఏపీఎం నర్సయ్య ఐకేపీ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్, ఐకేపీ సీసీలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుటే.. కారు పార్కింగ్

వేములవాడరూరల్: ఇది వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయం. కార్యాలయ ఆవరణలో నెలల తరబడి ఓ కారు పార్కింగ్ చేసి ఉంటోంది. రోజూ ఈ కార్యాలయానికి వివిధ గ్రామాలు, పట్టణం నుంచి పనుల కోసం ప్రజలు వస్తుంటారు. కానీ కారు నెలల తరబడి ప్రధాన ద్వారం వద్ద అడ్డుగా ఉంటోంది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాల లేమిపై ఆరా..

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని గురుకులాలతోపాటు మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ గృహాల్లో సౌకర్యాల లేమిపై సంబంధిత శాఖ అధికారులు ఆరా తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. చలికాలం మొదలైన సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు కావాల్సిన దుప్పట్లు రగ్గులు బెడ్స్ తదితర అంశాలపై సాక్షి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ‘సమస్యల తిష్ట’ పేరిట శీర్షికను ప్రచురించింది. దీనిపై ఆయా విద్యాలయాల అధికారులతో పాటు జిల్లా అధికారులు విద్యార్థులకు సౌకర్యాలు కల్పనకు కావలసిన అంశాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

శ్మశానవాటిక దారి గేటుకు తాళం



కోనరావుపేట: మండలంలోని మల్కపేట శ్మశానవాటికకు వెళ్లే దారిని కొందరు రైతులు మూసివేశారు. శ్మశానవాటికకు వెళ్లే దారి కోసం తమ భూమిని ఇచ్చామని, అయితే తమకు ఎలాంటి పరిహారం అందలేదని కొంతమంది రైతులు దారిలో గేటు ఏర్పాటు చేసి తాళం వేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరలిస్తాం

సాక్షి స్పందన

ముస్తాబాద్: మండలకేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు తరలిస్తామని సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న ‘సాక్షి’లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదంపై ప్రచురితమైన కథనానికి సెస్ ఎండీ స్పందించారు. మరోసారి పంచాయతీ అధికారులతో చర్చించి, అనువైన స్థల సేకరణ చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తామన్నారు.

కమిటీ ఎన్నిక



రాజశేఖర్

వీర్నపల్లి: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి జి. తిరుపతి జాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా చీకటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కముటం శేఖర్, ఉపాధ్యక్షుడిగా కలకుట్ల రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా బా నాల సుమలత, కోశాధికారిగా కన్నం జనార్దన్ ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్ర.దాన కార్యదర్శి మహేందర్ రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● దాడి కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం/చందుర్తి: ఇంటిగోడ విషయంలో మహిళపై దాడి చేసినకేసులో వ్యక్తికి రెండేళ్ల జైలుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి బుధవారం తీర్పు ఇచ్చినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ ఉరఫ్ గట్టు వసంతకు అదే గ్రామానికి చెందిన బొజ్జ ఉరఫ్ గట్టు మోహన్‌కు ఇంటి పక్కన ఉన్న గోడ విషయంలో 2014, ఆగస్టు 16న గొడవ జరిగింది. వసంత ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా మోహన్ గోడ నిర్మిస్తుండగా అడ్డుకుంది. దీంతో మోహన్ ఆమె కుడిచేతి వేలును విరిచాడు. దీనిపై వసంత ఫిర్యాదుతో చందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో మో హన్‌కు రెండేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తు న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

● సన్మానం

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులును సిరిసిల్ల సాహితీ సమితి బుధవారం సత్కరించింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, కార్యదర్శి వెంగల లక్ష్మణ్ మాట్లాడారు. కోడం నారాయణ, బూర దేవానందం, సిరిసిల్ల తిరుపతి, గుండెల్లి వంశీకృష్ణ, మారుతి, అంకారపు రవి తదితరులు పాల్గొన్నారు.

● వేముల నరేశ్‌కు సత్కారం

సిరిసిల్ల కల్చరల్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల నరేశ్ బుధవారం జిల్లా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో పలువురు న్యాయవాదులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను న్యాయవాదులు సత్కరించారు. అడ్వకేట్లు గుర్రం ఆంజనేయులు, దేవరాజు, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ భూములను కాపాడాలి

ఇల్లంతకుంట: జిల్లాలోని అన్ని మండలాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ పాలనలో చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాచేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వం సర్వేచేయించి ఆక్రమణకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు.

● రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్: పోతుగల్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మురికి చంద్రం అనే వ్యక్తి ఇంట్లో బుధవారం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. కొన్నేళ్లుగా పోతుగల్‌లో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ అక్రమ రవాణా చేస్తున్నాడన్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చంద్రం ఇంట్లో 15 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం శివారులోని కరీంనగర్ - సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభ్యమైనట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పట్టినట్లయితే వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

● పరామర్శ

ఇల్లంతకుంట: వల్లంపట్లలో నాయిని వంశీ అనే యువకుడు మృతిచెందగా ఒంటరిగా మారిన బాలిక సంజనను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. సంజన తల్లిదండ్రులు గతంలో మృతిచెందగా మంగళవారం తన అన్న మృతిచెందాడు. బాలిక అన్నివిధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇక్కడ గ్రామస్తులు, తదితరులున్నారు.

● కొండచిలువ హతం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం శివారు పొలం వద్ద వద్ద వ రికోత మిషన్‌లో చిక్కుకుని భారీ కొండచిలువ హతమైంది. గ్రామానికి చెందిన భూక్య శంకర్‌నాయక్ తన పొలంలో వరికోత యంత్రంతో వరి కోస్తుండగా భారీ కొండచిలువ మిషన్‌లో చిక్కుకుని ప్రాణాలు విడిచింది.



ముస్తాబాద్: ముస్తాబాద్–పోతుగల్ రహదారిలో మానేరు కెనాల్ వంతెన ప్రమాదకరంగా ఉంది. కెనాల్ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. పైగా వంతెన వద్ద సిద్దిపేట బైపాస్ రహదారి, మరో వైపు పొలాలకు వెళ్లేదారి ఉండడంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నాగరాజు, ఆర్‌అండ్‌బీ డీఈఈ, ఫోన్‌నెంబర్ : 9440818420

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

రసాభాసగా సింగిల్‌విండో సమావేశం

- రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో రూ.3.63 లక్షలు పక్కదారి పట్టాయని డైరెక్టర్ల ఆరోపణ



చందుర్తి: చందుర్తి సింగిల్‌విండో పాలక వర్గ సమావేశం రసాభాసగా సాగింది. సింగిల్ విండో కార్యాలయంలో పాలకవర్గ సభ్యుల సమావేశం అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస అధ్యక్షతన కొనసాగింది. గత రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ పేరిట డ్రా చేసిన రూ14లక్షల్లో రూ.3,63లక్షలు సీఈవో, చైర్మన్లు పక్కదారి పట్టించారని డైరెక్టర్లు ఆరోపించారు. సుతిలి దారం పేరిట రూ.4.86లక్షలు బిల్లులు పెట్టగా, అందులో రూ.1.93లక్షలు ఇతర ఖర్చుల పేరిట పక్కదారి పట్టినట్లు కార్యాలయ సిబ్బంది ఒప్పుకున్నారు. చైర్మన్ ఆదేశాల మేరకే డైరెక్టర్ ఎరువుల బస్తాల డబ్బులు చెల్లించకపోతే రూ1.08 లక్షలు మార్క్‌ఫెడ్‌కు చెల్లించామని, మిగతా డబ్బులు సీఈవో సొంతానికి వాడుకున్నట్లు తెలిపారు. మరో రూ.లక్షను సీఈవో వైస్ చైర్మన్ పుల్కం మోహన్ పేరిట రాయడంతో తమకు ఇవ్వకుండా తప్పుడు బిల్లు ఎలా రాస్తారంటూ కార్యాలయ సిబ్బందిపై వైస్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వానాకాలంలో రైతులు విక్రయించిన ఎరువుల బస్తాలను మార్కెట్‌లో కంటే రూ.50 ఎక్కువగా విక్రయించారన్నారు. వచ్చిన రూ.75వేల ఆదా యాన్ని సొంతానికి వాడుకుని సంఘంలో జమ చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చి గన్నీ సంచులు వ్యాపారులకు విక్రయించారని, వాటి లెక్క తేల్చాలని చైర్మన్‌ను డైరెక్టర్లు ప్రశ్నించారు. నాలుగు నెలల్లోనే రూ.4లక్షలకు పైగా డబ్బులు పక్కదారి పట్టించారని, వాటి వివరాలు తేల్చకపోతే కొనుగోలు కేంద్రాల నిర్వహణకు గ్రామాల్లో సహకరించమంటూ డైరెక్టర్లు చెప్పారు. గతంలో రైతులు పంట రుణ సమయంలో తీసుకున్న షేర్ల డబ్బులను కూడా స్వాహా చేశారంటూ రైతులు మాదాసు దేవ్య పాలకవర్గ సభ్యులతో గొడవకు దిగారు. సమావేశంలో వైస్ చైర్మన్ పుల్కం మోహన్, డైరెక్టర్లు అంచా రాంరెడ్డి, చింతపంటి రామస్వామి, అంచా శ్రీహరిరెడ్డి, నాగం శ్రీనివాస్, గుడిసే రమేశ్ , నగరం శంకర్, మెంగని రవి, సీఈవో శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లుమద్దిలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ



కుళ్లిన గుడ్డు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కొడిగుడ్ల పంపిణీపై బుధవారం తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతుగల్ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ మరవకముందే తెర్లుమద్దిలో కుళ్లిపోయిన కొడిగుడ్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కుళ్లిన గుడ్లు తిని అనారోగ్యానికి గురైతే ఎవరు బాధ్యులని బైతి నవీన్ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీడీపీవో బబిత, సూపర్‌వైజర్ అంజలి తెర్లుమద్దికి చేరుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లను పరిశీలించారు. మరోసారి కుళ్లిన గుడ్లను పంపిణీ చేయవద్దని కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. అనంతరం పోతుగల్‌లో కేంద్రాలను సందర్శించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

దారి పనులు అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న రుద్రంగి ఎస్సై అశోక్

చందుర్తి: పాఠశాల దారి పనులు నిలిపివేయాలని జోగాపూర్‌కు చెందిన ఓ రైతు కుటుంబ సభ్యులు బుధవారం నిరసన తెలిపారు. జోగాపూర్ జెడ్పీ పాఠశాలకు వెళ్లేదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోందని స్థానికులు ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు మొరం పోయించేందుకు నిధులు మంజూరు చేశారు. కాగా అదే గ్రామానికి ఇద్దరు రైతులు గతంలో నా స్థలం నుంచి దారి ఇచ్చామని, రోడ్డు పనులకు అడ్డుతగులుతున్నారు. కాగా పాఠశాల దారి పనులను పూర్తి చేయాలంటూ గ్రామస్తులు చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పనులు జరిగేలా రైతులతో మాట్లాడుతామని తెలిపారు. సాయంత్రం గ్రామస్తులు టిప్పర్‌తో మొరం తెప్పించి పోయించేందుకు సిద్ధం కాగా బీరయ్య అనే రైతు దంపతులు టిప్పర్‌కు అడ్డుపడి, దారిపై పడుకొని నిరసన తెలిపారు. దీనిపై గ్రామస్తులు సైతం ధర్నాకు దిగారు. రుద్రంగి ఎస్సై అశోక్ అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు. టిప్పర్‌లో తీసుకొచ్చిన మొరాన్ని రోడ్డుపై పోయించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలోని సాయిబాబా ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని 24 గంటల్లో అరెస్ట్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలానికి చెందిన అక్కపెల్లి సంతోష్ మంగళవారం బండలింగంపల్లి సాయిబాబా గుడిలో చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. కొత్తబస్టాండ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడని, అతని నుంచి రూ.1860 నగదు రికవరీ చేసినట్లు తెలి పారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ కోరారు. కలెక్టర్ ఎదుట బుధవారం విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని కోరారు. శిథిలావస్థలో, అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాసంస్థలకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈశ్వర్, నిశంత్, మనీశ్, నిరీక్షణ, సౌజన్య, శ్రావణి, నవ్య పాల్గొన్నారు.